సాక్షి
ములుగు
శనివారం | 5 | ఆగస్టు | 2023



భవిత బంగారం..
ప్రభుత్వం ఓపెన్ దూర విద్యా విధానాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలనుకునేవారు ఓపెన్ స్కూల్ విద్య వైపు చూస్తున్నారు. - 8లో▸



గుప్త నిధుల కలకలం
మల్హర్ మండలంలోని మల్లంపల్లిలో శుక్రవారం గుప్త నిధుల తవ్వకం కలకలం సృష్టించింది. గురువారం అర్ధరాత్రి తవ్వకాలు చేపట్టారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0^0 / 25.0^0
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గుణాత్మక విద్యను బోధించాలి



వాజేడు: ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మక విద్యను బోధించాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.పాణిని అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో తొలిమెట్టు కార్యక్రమంపై ఒక రోజు శిక్షణను ఉపాధ్యాయులకు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. ప్రభుత్వం గుణాత్మక విద్యపై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తోందని ఉపాధ్యాయులు ముందుగా అవగాహన చేసుకుని విద్యార్థులకు బోధించాలన్నారు. ఢిల్లీలో నిర్వహించిన సెమినార్‌కు రాష్ట్రం తరఫున ములుగు జిల్లా నుంచి డీఈఓ పాల్గొన్న సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు.

వరద బాధితులను ఆదుకోవాలి



ఎస్ఎస్‌తాడ్వాయి: ముంపు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ అన్నారు. పార్టీ నాయకుల సహకారంతో మేడారంలోని 200 వరద బాధిత కుటుంబాలకు శుక్రవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన సాంబయ్య, రామచంద్రయ్య కుటుంబాలను పరామర్శించి బియ్యం అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ సిరికొండ బలరాం, తెలంగాణ రాష్ట్ర పాలసీ అండ్ రీసెర్చ్ ఇన్‌చార్జ్ రాజునాయక్, జిల్లా ఉపాధ్యక్షులు జవహర్‌లాల్, మండల అధ్యక్షుడు మల్లెల రాంబాబు, నాయకులు లక్ష్మణ్, హన్మంతరెడ్డి, చిన్న, ఒబ్రమా, సాంబశివరెడ్డి, రవీంద్రచారి, వెంకట్రాం, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నంబర్ జారీపై పీఎస్‌లో ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

ములుగు రూరల్: 'అసైన్డ్, వ్యవసాయ భూమికి ఇంటి నంబర్' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బండారుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి కుమార్ ములుగు పోలీస్‌స్టేషన్‌లో అక్రమార్కులపై ఫిర్యాదు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి క్షేత్ర స్థాయిలో విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

మెరుగైన వైద్యమందించాలి



మంగపేట: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. మండలంలోని మంగపేట, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఓ గ్రామంలో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. అనంతరం వైద్యాధికారులు అల్లి నరేశ్, కారం నిఖిల్‌కుమార్, వైద్య సిబ్బందితో కలిసి గ్రామాల్లో పరిసరాలను సందర్శించారు. వైద్య శిబిరాల్లో 52 మందికి పరీక్షలు నిర్వహించగా.. 32 మంది జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించి డెంగ్యూ నిర్ధారణ పరీక్షల కోసం టీ హబ్ ములుగుకు పంపించారు. అనంతరం బ్రాహ్మణపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలోని 128 మంది విద్యార్థుల్లో ఏడుగురు విద్యార్థులకు కళ్ల కలక ఉన్నట్లు గుర్తించి వారిని ఒకే రూములో ఐసోలేషన్ చేయాలని వార్డెన్ కృష్ణయ్యకు సూచించినట్లు తెలిపారు. ఆయన వెంట వైద్యాధికారి నరేశ్, స్వప్నిత, అనీశ్, సిబ్బంది ఉన్నారు.

'సరస్వతీ'లో నీటినిల్వ

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం (సరస్వతీ) బ్యారేజీలో ఇంజనీరింగ్ అధికారులు నీటిని నిల్వ చేస్తున్నారు. వర్షాలు తగ్గడంతో బ్యారేజీలోని నాలుగు గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. ఎగువ గోదావరి, మానేరుల నుంచి ఇన్‌ఫ్లో 20,597 క్యూసెక్కులు వస్తుంది. గేట్లు ఎత్తడంతో దిగువకు అవుట్‌ఫ్లో 9,986 క్యూసెక్కులు వెళ్తుంది. కాళేశ్వరం మీదుగా మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీకి 1,14,860 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుంది. బ్యారేజీలో మొత్తం 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు సమానంగా అవుట్‌ఫ్లో తరలిస్తున్నారు.

సాగుకు కొండంత ధీమా

నిండుకుండల్లా జలాశయాలు

- మత్తడి పోస్తున్న ప్రాజెక్టులు
- ఎన్నడూ లేనివిధంగా లక్ష ఎకరాలకు పైగా వరి సాగు

ములుగు: ఇటీవల వరుసగా కురిసిన వర్షాలతో జిల్లాలోని ప్రధాన జలాశయాలు వెంకటాపురం (ఎం) రామప్ప గోవిందరావుపేట మండలంలోని లక్నవరం జలాశయాలు మత్తళ్లు పోస్తున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదలతో వెంకటాపురం(కె) మండలంలోని పాలెం ప్రాజెక్టు గేట్లు ఎత్తేశారు. మంగపేట మండలంలోని మల్లూరు ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వరిసాగును ముమ్మరం చేశారు.

రైతన్నకు ధీమా

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈఏడాది జిల్లా వ్యాప్తంగా 9 మండలాల్లో 1,01,982 ఎకరాల్లో వరి సాగవనున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ములుగు, వెంకటాపురం(ఎం) గోవిందరావుపేట, మంగపేట, ఏటూరునాగారం మండలాల్లో ఇప్పటి వరకు చెరువులు, బోరు బావుల కింద అధికారికంగా 11,500 ఎకరాల్లో నాట్లు వేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రామప్ప జలాశయం పరిధిలో అధికారికంగా 5,180, అనధికారికంగా మరో 5 వేల ఎకరాల్లో వరి సాగవనుంది. లక్నవరం చెరువు కింద అధికారికంగా 8,700 ఎకరాలు, అనధికారికంగా మరో ఆరు వేల ఎకరాల్లో సాగవనుంది. పాలెం ప్రాజెక్టు కింద 10,121 ఎకరాల్లో వరి సాగు అవుతుంది. మల్లూరు ప్రాజెక్టు కింద అధికారికంగా 7,500 ఎకరాల్లో పంట సాగు చేసేందుకు రైతన్నలు సిద్ధమయ్యారు. మరో 1,000 ఎకరాల్లో అనధికార సాగు జరగనుంది. వర్షాకాల సీజన్‌లో చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు అధికారులు కాలువల్ని శుభ్రం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నారు.



మత్తడి పోస్తున్న రామప్ప చెరువు

అలుగు పోస్తున్న చెరువులు

జిల్లా వ్యాప్తంగా 805 చెరువులు ఉండగా, ప్రస్తుతం అన్ని చెరువులు అలుగుపోస్తున్నాయి. దీంతో పంట సాగుకు రైతన్నలో ధీమా కనిపిస్తోంది. జిల్లాలో వరినాట్లు ఊపందుకున్నాయి. గ్రామాల్లో వ్యవసాయ సందడి నెలకొంది. భారీ వర్షాలతో 72 చెరువులు తీవ్ర వరద కారణంగా గండ్లు పడ్డాయి. వాటిని మరమ్మతు చేయడానికి ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా.. వరి సాగు విషయంలో రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

పత్తి రైతులకు ఆటంకం

వరుస వర్షాలు పత్తి రైతులకు ఆటంకంగా మారాయి. గత నెలలో విత్తనాలు వేయగా.. ఆతర్వాత కొద్ది రోజులకే భారీ వర్షాలు కురిశాయి. దీంతో మొలకెత్తిన పత్తి మొక్కకు వేరుకుళ్లు అంటుకుంది. నీటి నిల్వ కారణంగా మొక్కలు చనిపోయాయి. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పత్తి రైతులు మరోసారి చనిపోయిన మొక్కల ప్రాంతంలో పోగుంటలల్లో విత్తనాలు వేస్తున్నారు. వర్షాలు సాధారణంగా కురుస్తుండడంతో ఇప్పుడిప్పుడే మొక్కలు పెరుగుతున్నాయి. మరోసారి వరుస వర్షాలు పడితే పత్తి రైతులకు భారీ నష్టం ఏర్పడడం ఖాయంగా కనిపిస్తుంది. ఇప్పటికే పత్తి చేలలో గడ్డి భారీగా పెరిగింది. వాటిని తీయడానికి కూలీల కొరత ఏర్పడుతోంది.

మండలాలు:	9
జిల్లాలోని జలాశయాలు: రామప్ప, లక్నవరం	
ప్రాజెక్టులు:	మల్లూరు, పాలెం
మొత్తం చెరువులు:	805
అలుగుపోస్తున్న చెరువులు:	805
ఇప్పటి వరకు సాగైన ఎకరాలు:	11,500



మత్తడి పోస్తున్న మల్లూరు ప్రాజెక్ట్



గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న పాలెం ప్రాజెక్టు నీరు

ఎన్నికల వేళ.. నిధుల గోల

ఉమ్మడి జిల్లాకు రూ.45 కోట్ల సీడీపీ నిధులు

- ఎమ్మెల్యేల కోటా కింద రూ.27 కోట్లు..
- ఎమ్మెల్సీల కోటా కింద మరో రూ.18 కోట్లు విడుదల
- పెండింగ్ పనుల పూర్తికి అవకాశం
- తమ ప్రాంతాలకు కేటాయింపు చేసుకోవడానికి ద్వితీయ శ్రేణి నాయకుల పోటాపోటీ ప్రయత్నాలు



నియోజకవర్గాల్లో సీడీపీ నిధుల గోల మొదలైంది. ఎన్నికల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయడంతో ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న ద్వితీయ శ్రేణి నాయకులు తమ ప్రాంతాలకు కేటాయింపు చేసుకోవడానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వద్ద పోటీ పడుతున్నారు. ఈ నిధులతో అసంపూర్తి పనులు పూర్తి చేసే అవకాశం ఉండడం, ఆ పనులు నామినేషన్, టెండర్ పద్ధతిన కేటాయించనుండడంతో ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

సాక్షిప్రతినిధి, వరంగల్: నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం(సీడీపీ) కింద పనులు చేపట్టడానికి ఎట్టకేలకు నిధులు విడుదలయ్యాయి. కొంతకాలంగా జాప్యం జరిగినా.. ఎన్నికల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈనిధులు విడుదల చేసింది. అయితే ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న నియోజకవర్గంలోని ద్వితీయ శ్రేణి నాయకులు ఈ నిధుల కోసం పోటాపోటీగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వద్ద ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్‌లో 12 మంది శాసనసభ్యులు, ఎనిమిది మంది శాసనమండలి సభ్యులున్నారు. ఇందులో ఒకరు కాంగ్రెస్ పార్టీ(ములుగు) ఎమ్మెల్యే కాగా.. మిగతా వారంతా అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందినవారే. కాగా ఒక్కో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి ఏటా రూ.3 కోట్లున్న సీడీపీ నిధులను 2021 నుంచి రూ.5 కోట్లకు పెంచారు. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్‌కు ఏటా రూ.100 కోట్లు వస్తున్నాయి. అయితే ఆ నిధుల విడుదలలో కొంత కాలంగా జాప్యం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సీడీపీ నిధులు విడుదల చేస్తూ మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.. ఒక్కొక్కరికీ రూ.2.25 కోట్ల చొప్పున కేటాయించింది. ఈ మేరకు ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలకు చెందిన సీపీఓ, డీఈఓ కార్యాలయాలకు నిధుల కేటాయింపునకు సంబంధించిన సమాచారం శుక్రవారం అందింది.

ఆశావహుల పోటాపోటీ

సీడీపీ నిధులకు సంబంధించి ఎమ్మెల్యేల కోటా కింద రూ.27 కోట్లు, ఎమ్మెల్సీలకు రూ.18 కోట్లు కలిపి.. ఉమ్మడి జిల్లాకు రూ.45 కోట్లు ఈ విడత విడుదలయ్యాయి. వీటికోసం ఎదురుచూస్తున్న నియోజకవర్గ ద్వితీయశ్రేణి నేతలు నిధులు వచ్చిన విషయం తెలియగానే హైదరాబాద్‌కు మకాం మార్చారు. ఎమ్మెల్యేలందరూ కూడా అసెంబ్లీ సమావేశాల్లో ఉన్నందున అక్కడే వారిని కలిసి సీడీపీ నిధుల్లో తమ ప్రాంతాలకు వాటా కోరే పనిలో ఉన్నారు. ఈ నిధులు పొందడం ద్వారా ఎమ్మెల్యే వద్ద తమ ప్రాధాన్యతను కిందిస్థాయి కేడర్‌కు తెలియజేసే పనిలో ఈ నాయకులు ఉండగా.. నియోజకవర్గాల్లో సీడీపీ నిధుల గోల మొదలైంది. కాగా.. 2021 సంవత్సరంలో కరోనా నేపథ్యంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి సీడీపీ నిధులను కూడా ఖర్చు చేసిన విషయం తెలిసిందే. గతేడాది 'మన ఊరు–మన బడి' కోసం కేటాయించారు. ఈసారి ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సీడీపీ కింద ఒక్కొక్కరికి రూ.2.25 కోట్లు కేటాయించగా.. ఈ నిధులను చాలాకాలంగా రూ.1 లక్ష నుంచి రూ.4 లక్షల వరకు వెచ్చిస్తే అసంపూర్తి పనులు పూర్తయ్యే అవకాశం ఉన్నవాటిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యేలు నాయకులకు సూచిస్తున్నట్లు సమాచారం. సుమారు ఏడాది తర్వాత విడుదలైన నిధుల నుంచి తమ తమ ప్రాంతాల్లో పనులకు కేటాయించాలని కోరేందుకు వెళ్తున్న గ్రామ, మండల, జిల్లా స్థాయి నాయకులు పోటీ పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ నిధులను ఆచితూచి ఖర్చు చేసే యోచనలో ఉన్నారు.

నిబంధనల మేరకే పనులు..

సీడీపీ నిధుల విడుదలతో నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా సాగనున్నాయి. ఈ నిధుల వినియోగంలో మంత్రుల ఆమోదంతో పాటు పర్యవేక్షణ కూడా ఉండనుంది. ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌లకు ఈ బాధ్యతలను రెండేళ్ల క్రితం అప్పగించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించగా, మంత్రి సత్యవతి రాథోడ్‌కు ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీ స్థానంతో పాటు నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు కేటాయించారు. విద్యావంతులు, ఉపాధ్యాయుల, ఎమ్మెల్యే, గవర్నర్ కోటాల కింద ఎంపికైన ఎమ్మెల్సీల నిధులు ఉమ్మడి వరంగల్‌లోనే ఖర్చు కానుండగా సీఎం పర్యవేక్షణలో కేటాయించనున్నారు. కాగా గతంలో చూపిన మార్గదర్శకాల మేరకే పనులు చేపట్టాలని నిధుల విడుదల ఉత్తర్వుల్లో ప్రభుత్వం సూచించింది. దాదాపు సీడీఎఫ్ నిధులతో చేపట్టే పనులను కార్యకర్తలకు అప్పగించే అవకాశం ఉన్నందున, రూ.5 లక్షలు దాటిన పనులు కచ్చితంగా టెండర్ ద్వారా చేపట్టి.. రూ.5లక్షల లోపు పనులు నామినేషన్‌పై చేయవచ్చని వెసులుబాటు కల్పించింది.

ముంపు ప్రాంతాల్ని పరిశీలించిన కలెక్టర్



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్

మంగపేట: మండల కేంద్రంలోని గౌరారం వాగు వరద ఉధృతికి ముంపునకు గురైన ప్రాంతాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం పరిశీలించారు. మంగపేట, బోరునర్సాపురం గ్రామాల మధ్య ఉన్న గౌరారం వాగుపై అసంపూర్తిగా నిర్మించిన నూతన బ్రిడ్జిని కలెక్టర్ పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ముంపునకు గురైన ప్రాంతాలు, జరిగిన నష్టం వివరాలను సంబంధిత రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముంపు బాధితులు ఇంటి స్థలాలు ఎక్కడిచ్చినా వెళ్లేందుకు సుముఖంగా ఉన్నారా లేదా? రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తమకు ఇంటి స్థలాలు ఎక్కడ ఇచ్చినా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు వరద బాధితులు కలెక్టర్‌కు తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ..

మంగపేట పీహెచ్‌సీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె స్వయంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని పీహెచ్‌సీ నిర్వహణ, వైద్యులు, సిబ్బంది పనితీరును అంచనా వేశారు. తాము పెట్టే ఇండెంట్‌లోని పలు రకాల మందులు రావట్లేదని ఫార్మసిస్ట్ సంధ్య కలెక్టర్‌కు వివరించారు. వర్షాకాలం ముగిసే వరకు గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా అన్ని గ్రామాలు, గూడేల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని వైద్యాధికారిని కలెక్టర్ ఆదేశించారు. పీహెచ్‌సీలో నీరు నిల్వకుండా చూడాలని, ఇంకుడు గుంతలు నిర్మించాలని కార్యదర్శి హీరూను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్‌ఐ కామేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి మాలోతు హీరూ తదితర అధికారులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు స్థలాల పరిశీలన

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి, మల్యాల ముంపు ప్రాంత వాసులకు సురక్షితమైన ప్రాంతాల్లో ఇళ్లు కట్టించేందుకు కొండాయి, మల్యాల, కొత్తూరు ప్రాంతాల్లోని భూములను శుక్రవారం రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి పరిశీలించారు. ఆయా ప్రాంతాల భూములు పరిశీలించి వివరాలు సేకరించారు. బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ గోవింద్‌నాయక్, సర్పంచ్ ఈసం రామ్మూర్తి, బీఆర్ఎస్ నాయకులు మాదరి రామయ్య, రాంబాబు, తహసీల్దార్ వీరస్వామి, ఆర్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ప్రభుత్వం అండ

వెంకటాపురం(ఎం): వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధితులు ఆందోళన చెందవద్దని రెడ్కో చైర్మన్ యారువ సతీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బుర్గుపేటలో వరద బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. నిత్యావసరాలు అందించారు. ఇందులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, పోశాల వీరమల్లు, మాడుగుల రమేశ్, మండల శ్రీధర్‌రెడ్డి, చింతిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, ఉమ్మడి సాంబయ్య, బి.జ్ఞానేందర్, నర్రా భద్రయ్య పాల్గొన్నారు.

బాధితులకు సరుకుల పంపిణీ



ఏటూరునాగారం: బ్రిడ్జిని పరిశీలిస్తున్న రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: వరద బాధితులకు ప్రభుత్వం ఉండగా ఉంటుందని రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వెంగ్లాపూర్, కాల్వపల్లి, ఎల్బాక మేడారం గ్రామాల్లో వరద బాధిత కుటుంబాలకు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్ పంపించిన సరుకులను నిజాంపేట్ 9వ డివిజన్ కార్పొరేటర్ రజిత రవికాంత్‌తో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవిందనాయక్, ఎస్సై ఒంకార్‌యాదవ్, సర్పంచ్ సంపత్‌రెడ్డి, ఏటూరునాగారం జీసీసీ డైరెక్టర్ పురుషోత్తం, మండల అధ్యక్షుడు మల్లయ్య, నాయకులు చంద్రయ్య, వసంతరావు, రజనీకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూతనివ్వాలి

- ఏఎస్పీ సంకీర్త్
- ముంపు బాధితులకు నిత్యావసరాల అందజేత

ఏటూరునాగారం: వరద బాధితులకు మానవతా దృక్పథంతో చేయూతనివ్వాలని ఏఎస్పీ సంకీర్త్ దాతలను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో కొండాయి, మల్యాల వరద ముంపు బాధితులకు సెయింట్ జాన్ నర్సింగ్ కాలేజ్, మైత్రి స్కూల్ చైర్మన్ పంజాల శంకరయ్య ఆధ్వర్యంలో 300ల కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుస్తులను ఏఎస్పీ హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షమీమా, వైస్ ప్రిన్సిపాల్ కవిత, ఫిబా, సుజాత, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో

ములుగు జిల్లా ఆర్యవైశ్య మహా సభ జిల్లా అధ్యక్షుడు సిద్దంశెట్టి శ్రీనివాసరావు పిలుపు మేరకు అయ్యప్ప స్వామి చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ సింగిరికొండ మాధవ్‌శంకర్, ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో మల్యాల, దొడ్ల, కొండాయి ముంపు బాధితులకు రూ.4లక్షల విలువైన నిత్యావసర సరుకులు, బాధిత కుటుంబానికి రూ.వెయ్యి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు సిద్దంశెట్టి వైకుంఠం, ములుగు ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దంశెట్టి లక్ష్మణ్‌రావు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు బాలసాని గౌరీశంకర్, మంగపేట మండల అధ్యక్షుడు అనంతుల కృష్ణమూర్తి, నాయకులు పొబ్బాజు సత్యనారాయణచారి, మాదరపు చంద్రశేఖర్, చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డ రవీందర్, పాలకుర్తి శ్రీనివాస్, శ్రీరామ్ ఈశ్వరయ్య, బొద్దుల దివాకర్, తక్కలపల్లి యుగేందర్, పబ్బా రమేశ్, ఆకుల ప్రభాకర్ పాల్గొన్నారు.

ఫాదర్ ఆఫ్ కొలంబో, మెడికేర్ ఆస్పత్రి

మండల కేంద్రంలోని పునరావాస కేంద్రాల్లో నివాసం ఉంటున్న 300ల మంది కొండాయి, మల్యాల, దొడ్ల ముంపు ప్రజలకు ఫాదర్‌ఆఫ్ కొలంబో, మెడికేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఏఎస్పీ హాజరై బాధితులకు నిత్యావసర కిట్లు, మెడికల్, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికేర్ ఆస్పత్రి డైరెక్టర్ ఫాదర్ చిన్నపరెడ్డి, వైద్యులు మహేందర్‌రెడ్డి, రామ్‌గోపాల్‌వర్మ, సురేశ్, ఆస్పత్రి సిబ్బంది రవీందర్, గండి వెంకటేశ్వర్లు, తాటిపల్లి శంకర్, పీఎస్ఎఫ్ మార్కెటింగ్ సభ్యులు విజయేందర్‌రెడ్డి, వినయ్‌కుమార్, సందీప్, ఏట దామోదరస్వామి, జేఆర్‌పీలు భిక్షపతి, పాపయ్య పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందిస్తున్న నర్సంపేట ఆర్యవైశ్య, అయ్యప్పస్వామి ట్రస్టు, కాంగ్రెస్ నాయకులు

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో..

వరద బాధితులకు దుప్పట్లు, వంట పాత్రలను వరంగల్, ములుగు శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం పోస్ట్‌మెట్రిక్ పునరావాస కేంద్రంలో ఏటీడీఏ దేశీరాం, బ్రహ్మకుమారి వసంత, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అందజేశారు. ఎన్ఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కొౌట్టి సుబ్బారావు దంపతులు వంద దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి కొమురమ్మ, అనిల్, శ్రీమాన్‌రెడ్డి, రవీందర్, తిరుపతయ్య, శ్రీలత, సమ్మయ్య, వార్డెన్లు మనోజ్, చక్రవర్తి, కొండాయి ఉప సర్పంచ్ మహేశ్ పాల్గొన్నారు.

ఎలిశెట్టిపల్లిలో..

ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు అకాల వర్షాలకు నష్టపోయిన వరద బాధితులు ఎలిశెట్టిపల్లి, అల్లంవారిఘణపురం, గుర్రాల బావి, బోజెరువు వరద బాధితులకు నర్సంపేట శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయం ధర్మకర్తల ట్రస్ట్ ఆలయ కమిటీ చైర్మన్ మాధవశంకర్ సాయంతో నిత్యావసర సరుకులను శుక్రవారం చెల్పాకలో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చింత సుమతి రమేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయూబ్, వావిలాల ఎల్లయ్య, గుడ్ల దేవేందర్, డొంగిరి మధుబాబు, కర్నె సత్యం, సోదారి రామయ్య, మామిడి రాంబాబు, నాగవత్ కిరణ్, సోదారి హరీష్, సోలం సురేశ్, వాసం రాంబాబు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, అయ్యప్ప సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



కొలంబో, మెడికేర్ ఆధ్వర్యంలో బాధితులకు సరుకులు అందజేస్తున్న ఏఎస్పీ సంకీర్త్



గొత్తికోయలకు బియ్యం, దుస్తులు అందిస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్ సుబ్బారావు, ఏఎస్పీ సంకీర్త్

గొత్తికోయలకు సరుకుల పంపిణీ

వరదలో ఉన్న గుర్రాలబావి గొత్తికోయలకు ఎంత సాయం చేసినా.. వారి బాధ తీర్చలేనిదని నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ సుబ్బారావు అన్నారు. వరద బాధితులకు సాయం కోసం నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ కూనిశెట్టి సుశీలదేవి– సుబ్బారావు, హనుమకొండ సుబేదారికి చెందిన బ్రహ్మకుమారీస్, ములుగు శాఖల ఆర్థిక సహకారంతో శుక్రవారం రూ.40 వేల విలువైన 200 దుప్పట్లు, 5 క్వింటాళ్ల బియ్యం, 10 బస్తాల పాత బట్టలు, ఇతర వస్తువులను గొత్తికోయ గూడేల్లోని వరద బాధితులకు అందించారు. కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, సీఐ మండల రాజు, ఎస్సై కృష్ణప్రసాద్, సిస్టర్ బీకే వసంత, బీకే అనిల్ కులకర్ణి, శ్రీమాన్, తిరుపతి, రవీందర్, కొమురమ్మ, శ్రీలత, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఏఎస్పీ

ఏటూరునాగారం: స్థానిక పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న ముంపు బాధితులను శుక్రవారం ఏఎస్పీ సంకీర్త్ సందర్శించి వరద బాధితులతో మాట్లాడారు. దాతల సాయంతో అన్నిరకాల వస్తువులు వస్తున్నాయని, ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం అన్ని రకాలుగా సాయం అందిస్తోందని చెప్పారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. నిత్యావసర సరుకులు వస్తున్నాయని, గ్రామాల్లో నివాసం ఉండేందుకు పక్కా ఇళ్లు కావాలని ఏఎస్పీని కోరారు. తమకు సమాచారం లేకుండా ఎవరూ ఈ సెంటర్లను విడిచివెళ్లవద్దని ఏఎస్పీ సంకీర్త్ కోరారు. అందుతున్న వసతిపై ఆరా తీశారు. ఆయన వెంట సీఐ రాజు, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, ఏటీడీఓ దేశీరాం ఉన్నారు.

క్లుప్తంగా

ఎంజీఎంలో దొంగ పట్టివేత



దొంగను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రికి వచ్చే రోగుల వద్ద చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని శుక్రవారం సెక్యూరిటీ గార్డులు పట్టుకుని మట్టెవాడ పోలీసులకు అప్పగించారు. పెగడపల్లి డబ్బాలకు చెందిన శ్యామల రాజ్‌కోటి రోగుల వద్ద చోరీ చేస్తుండగా సెక్యూరిటీ గార్డులు గుర్తించారు. సదరు దొంగ నుంచి రూ. 1800 నగదుతోపాటు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని మట్టెవాడ పోలీసులకు అప్పగించారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

గార్ల: బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన శుక్రవారం మర్రిగూడెం గ్రామంలో జరిగింది. గార్ల మండలం సేరిపురం పంచాయతీ మర్రిగూడెం గ్రామానికి చెందిన బాలిక ఇంట్లో తండ్రి మందలించాడనే ఆక్రోశంతో ఇంట్లో ఉన్న పురుగుమందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు బాలికను గార్ల సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ తెలిపారు.

మార్కెట్‌లో ఎలక్ట్రానిక్ వస్తువుల చోరీ

కొడకండ్ల: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో రూ.1.77 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు చోరీకి గురైనట్లు చైర్మన్ పేరం రాము తెలిపారు. వ్యవసాయ మార్కెట్‌లో 2018లో వేబ్రిడ్జి నిర్మించి డిజిటలైజర్, జంక్షన్ బాక్స్, యూపీఎస్, జంబో డిస్‌ప్లే, కంప్యూటర్, ప్రింటర్ ఏర్పాటు చేశామన్నారు. విధుల్లో భాగంగా మార్కెట్ సిబ్బంది శుక్రవారం వేబ్రిడ్జి గదిని పరిశీలించగా తాళం పగులగొట్టి ఉన్నట్లు గమనించి తమకు సమాచారం అందించినట్లు తెలిపారు. వెంటనే తాము మార్కెట్‌కు చేరుకుని గదిని పరిశీలించగా అందులోని వస్తువులన్నీ చోరీకి గురైనట్లు గుర్తించామన్నారు. ఈ విషయమై మార్కెట్ కార్యదర్శి నిరంజన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చైర్మన్ తెలిపారు.

బావుపేట రైల్వేగేట్ నాలుగు రోజులు మూసివేత

కాజీపేట రూరల్: కాజీపేట సబ్‌డివిజన్ పరిధి హసన్‌పర్తి–ఉప్పల్ రైల్వేస్టేషన్‌ల మధ్య ఉన్న బావుపేట రైల్వేగేట్‌ను ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం రాత్రి తెలిపారు. ఎమర్జెన్సీ రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ రిపేర్, మూడవ రైల్వే లైన్ అభివృద్ధి పనుల కారణంగా బావుపేట నుంచి కమలాపూర్ గ్రామాలకు వెళ్లే(రోడ్ ట్రాఫిక్) 9వ నంబర్ ఇంజనీరింగ్ రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్‌ను మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి వేరే మార్గం గుండా వెళ్లాలని సూచించారు.



భవిత బంగారం..

- ఓపెన్ టెన్త్, ఇంటర్‌తో ఉన్నత విద్యాభ్యాసం
- బడికి వెళ్లి మానేసిన, చదువుకోలేని వారికి అవకాశం
- ఈ నెల 10 వరకు అడ్మిషన్లు

నెక్కొండ: చదువుతోనే గౌరవం. చదువుంటే భవిత బంగారం. చదువును మళ్లీ కొనసాగిద్దాం.. సమాజంలో మనమూ గుర్తింపు పొందుదాం.. అనే నినాదాలతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్టేట్ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో దూర విద్యా విధానాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా పని చేసుకుంటూనే సెలవు దినాల్లో ఓపెన్ పాఠశాలలో చదువుకోవచ్చు. దీంతో పని వృత్తుల వారు, డ్రైవింగ్ లైసెన్స్ అవసరమైన వారు, ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలనుకునే ఓపెన్ స్కూల్ విద్య వైపు చూస్తున్నారు. ఇక్కడ చదువు పూర్తి చేస్తే రెగ్యులర్ సమాన సర్టిఫికెట్‌కు ప్రాధాన్యం ఉండడంతో ఓపెన్ స్కూల్‌లో చదివేందుకు చాలా మంది ముందుకొస్తున్నారు.

దరఖాస్తు విధానం..

పదో తరగతి చదివేందుకు ఎలాంటి విద్యార్హత అవసరం లేదు. 14 నుంచి 50 ఏళ్ల వయస్సు గలవారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయస్సు నిర్ధారణ ధ్రువపత్రం తహసీల్దార్ లేదా మున్సిపల్ అధికారులు జారీ చేసి ఉండాలి. మధ్యలో బడి మానేస్తే అప్పటి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ), ఆధార్‌కార్డుతో ప్రవేశం పొందొచ్చు. పదో తరగతి, ఇంటర్మీడియట్ 2023–24 విద్యా సంవత్సరంలో చేరే అభ్యాసకులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఆగస్టు 10వ తేదీ వరకు చెల్లించొచ్చు. పదో తరగతి అడ్మిషన్ ఫీజు ఓసీలకు రూ.1550, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ. 1150, ఇంటర్‌లో అడ్మిషన్ కు ఓసీలకు రూ. 1800, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 1500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అభ్యాసకులు www. teanfanoapenrchooorf ఆన్ లైన్‌లో ఫీజు చెల్లించి రశీదును అధ్యయన కేంద్రాల్లో దరఖాస్తుతో సమర్పించాల్సి ఉంటుంది.



అధ్యయన కేంద్రంలో తరగతులకు హాజరైన అభ్యాసకులు (ఫైల్)

ఓపెన్ విద్య వరం..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 112 అధ్యయన కేంద్రాల్లో ఈ సార్వత్రిక (ఓపెన్ స్కూల్)ను ప్రభుత్వం కొనసాగిస్తోంది. ప్రభుత్వం 2008–09 విద్యా సంవత్సరంలో ఓపెన్ విద్యను ప్రవేశ పెట్టింది. అప్పట్లో కేవలం పదో తరగతి వరకు మాత్రమే అందుబాటులోకి తీసుకువచ్చారు. 2010–11లో ఇంటర్మీడియట్‌ను కూడా ప్రవేశ పెట్టారు. చదువు మధ్యలో ఆపివేసిన వారికి ఈ ఓపెన్ విద్య వరంగా మారింది.

వీరు అర్హులు

- చదువు మధ్యలో ఆపేసిన వారు, గృహిణులు, చదువుకు దూరమైన వారు సమీపంలోని ఓపెన్ కేంద్రాల్లో అడ్మిషన్ పొందొచ్చు.
- అర్హులు ఈ నెల 10వ తేదీ వరకు టీఎస్ ఆన్‌లైన్, ఏపీ ఆన్‌లైన్ ద్వారా, లేక మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని, ఆ రశీదును దగ్గరలోని అధ్యయన కేంద్రంలో సమర్పించాలి.
- ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు పొందేవారు తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది. సమీపంలోని అధ్యయన కేంద్రాన్ని ఎన్నుకుంటే బాగుంటుంది.

జిల్లాల వారీగా స్టడీ సెంటర్లు

హనుమకొండ	19
వరంగల్	21
జనగామ	15
మహబూబాబాద్	23
భూపాలపల్లి	14
ములుగు	13

అడ్మిషన్లు ఇలా...

సంవత్సరం	టెన్త్	ఇంటర్
2019-20	3181	3853
2020-21	4100	4441
2021-22	3337	4041
2022-23	2644	4346

కనీస ఫీజుతోనే ప్రవేశాలు



రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు కనీస ఫీజుతోనే అవకాశం కల్పిస్తోంది. ఓపెన్ విద్యలో పది, ఇంటర్ పూర్తి చేసుకున్న వారికి రెగ్యులర్ విద్యతో సమాన గుర్తింపు ఉంటుంది. ఉన్నత విద్య, పదోన్నతులు, ఉద్యోగాలు పొందడానికి, చదువు మధ్యలో మానేసిన వారికి ఎంతో ఉపయోగకరం. చదువుకోవాలనే ఆసక్తి ఉన్న వయోజనులు (అభ్యర్థులు) ఓపెన్ కేంద్రాల్లో చేరి సద్వినియోగం చేసుకోవాలి.

– మురాల శంకర్‌రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్

స్పందిస్తున్న హృదయాలు

సాక్షి ఎఫెక్ట్..

చెన్నారావుపేట: నిట్‌లో సీటు సాధించిన నిరుపేద విద్యార్థి సన్నీకి ఆర్థిక చేయూతనందించడానికి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన నెల్లూరి మనీష్‌కుమార్ ముందుకొచ్చారు. బాల్యం నుంచి సర్కారు బడి, కళాశాలల్లో చదివి నిట్‌లో సీటు సాధించిన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బాపునగర్ గ్రామానికి చెందిన సన్నీ నిరుపేద. ఆర్థిక సమస్యలతో చదువుకు దూరం కావాల్సి వస్తుందని మనోవేదన చెందుతున్న ఆ విద్యార్థి కన్నీటి గాథపై 'సాక్షి'లో శుక్రవారం 'దాతలు దయచూపరూ..! అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆన్‌లైన్‌లో 'సాక్షి' ఈ పేపర్ ద్వారా ఈ కథనం చూసిన నెల్లూరి మనీష్‌కుమార్.. సన్నీ కళాశాలలో చెల్లించే ఫీజు రూ. 36 వేలు అందజేస్తానని తెలిపినట్లు విద్యార్థి తండ్రి ప్రభుదాస్ తెలిపాడు. అలాగే మాజీ ఎంపీపీ జక్క అశోక్ రూ. 2500, ఉప్పరపల్లి హైస్కూల్‌లో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తించిన ఫ్లోరెన్స్ రూ.1000, మరికొంత మంది మిత్రులు సాయం అందించారని తెలిపారు. సాయం అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. తన కుమారుడి చదువుకు దాతలు కరుణించాలని ప్రభుదాస్ వేడుకుంటున్నాడు.

దాతలు 9052001950 ప్రభుదాస్, చెన్నారావుపేట ఎస్‌బీఐ అకౌంట్ నంబర్ 62202764705, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0021352కి సాయం అందించాలని కోరారు.

కేఎంసీకి పార్థివదేహం అప్పగింత



సీతమ్మ (ఫైల్)

గార్ల: గార్లకు చెందిన గంజి సీతమ్మ(88) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె పార్థివ దేహాన్ని శుక్రవారం ఖమ్మం మమత మెడికల్ కళాశాలకు అప్పగించారు. గార్ల మండలంలో పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించడం ఇదే తొలిసారి. సీతమ్మ భౌతికాయానికి అంతిమయాత్ర నిర్వహించిన అనంతరం శ్మశానవాటిక వద్ద మెడికల్ కళాశాలకు అప్పగించారు. కాగా, మృతురాలు సీతమ్మ పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించిన కుమారులు గంజి ఈశ్వర్‌లింగం, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వెంకటనారాయణ, కూతుళ్లు సూర్యకళ, మనెమ్మను గార్ల ప్రజలు అభినందించారు. మృతురాలి పెద్ద కుమారుడు గంజి ఈశ్వర్‌లింగం నేత్రనిధి, అవయవదానం సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. మమత మెడికల్ కళాశాల యాజమాన్యం మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రశంస పత్రం అందజేసింది.



సీతమ్మ పార్థివదేహాన్ని ఖమ్మం మమత మెడికల్ కళాశాలకు అప్పగిస్తున్న కుమారుడు ఈశ్వర్‌లింగం

పని కల్పిస్తే.. సున్నం పెట్టాడు

- రూ.2.50 లక్షల విలువైన దుస్తులతో పని మనిషి పరార్
- పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

హసన్‌పర్తి: అపరిచిత వ్యక్తిని పనిలో పెట్టుకుంటే చివరికి గోదాంనే లూటీ చేశాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పరిమళ కాలనీలో జరిగింది. ఈ మేరకు బాధితుడు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నగరంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన చక్రవర్తి హనుమకొండ టైలర్ స్ట్రీట్‌లో ఓ గార్మెంట్ (బట్టల)షాపు నిర్వహిస్తున్నాడు. అందుకు సంబంధించిన గోదాం పరిమళ కాలనీలో ఉంది. బట్టల షాపులో పనిచేయడానికి ఏపీలోని ఈస్ట్ గోదావరి జిల్లా తాడిపల్లి గూడేనికి చెందిన సుబ్రహ్మణ్యాన్ని పనిలో కుదుర్చుకున్నాడు. రోజూ ఉదయం షాపుకు వెళ్లి రాత్రి గోదాం ముందు రూంలో వచ్చి నిద్రించే వాడు. రోజు మాదిరిగా సుబ్రహ్మణ్యాన్ని యజమాని రాత్రి గోదాం వద్ద వదిలి పెట్టాడు. శుక్రవారం ఉదయం గోదాం వద్దకు వచ్చిచూసే సరికి పని మనిషి కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్. గోదాంలో సుమారు రూ.2.50లక్షల స్టాక్ మాయమైనట్లు గుర్తించాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

చెట్టుకు ఆరో పుట్టిన రోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

మహబూబాబాద్: మహబూబాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట టీస్టాల్ నిర్వాహకుడు గుగులోత్ శంకర్ నాటిన చెట్టుకు ఆరవ పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాగా వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి మాట్లాడారు. శంకర్ మొక్క నాటి సంరక్షించడంతో పాటు ఆరేళ్లుగా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించం హర్షణీయమని, భావితరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు./కార్యక్రమంలో కమిషనర్ టి.ప్రసన్నరాణి, డీఈ సీహెచ్.ఉపేందర్, ఫ్లోర్ లీడర్లు చిట్యాల జనార్ధన్, సూర్నపు సోమయ్య, కౌన్సిలర్లు యాళ్ల పుష్పలత, మార్నెని శ్రీదేవి, డొలాగర్ స్వాతిశంకర్ పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సర్దుబాటుకు కొత్త పోస్టులు

- ఉమ్మడి జిల్లా పరిధిలో 1887 కేటాయింపు

హన్మకొండ అర్బన్: వీఆర్‌ఏల సదర్దుబాటు కోసం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం వారికి అవసరమైన పోస్టులు, సూపర్ న్యూమరీ పోస్టులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం వివిధ కేటగిరీల్లో 1887 పోస్టులు మంజూరయ్యాయి. వాటిలో వరంగల్ జిల్లాకు 312, హనుమకొండ 354, జనగామ 304, జయశంకర్ భూపాలపల్లి 288, మహబూబాబాద్ 287, ములుగుకు 242 ఉన్నాయి. ఆయా పోస్టుల్లో రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, రికార్డ్ అసిస్టెంట్, చైన్‌మెన్, ఇరిగేషన్ విభాగంలో లష్కర్, హెల్పర్, మిషన్ భగీరథలో హెల్పర్, మున్సిపల్‌లో వార్డు ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి. కాగా, జిల్లాల్లో ఇప్పటికే వివిధ శాఖల్లో ఖాళీలను గుర్తించి సిద్ధం చేశారు. మొత్తంగా వీఆర్‌ఏల సదర్దుబాటుకు ఉన్న ఆటంకాలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం తొలగిస్తోంది. ఇక వారసత్వ ఉద్యోగాలకు సంబంధించి కొంత స్పష్టత రావాల్సి ఉందని అధికారులు చెపుతున్నారు. దీనితోపాటు వీఆర్‌ఏల సర్టిఫికెట్లు, వివరాల పరిశీలన వేగంగా సాగుతోంది.

జిల్లాల వారీగా పోస్టుల మంజూరు వివరాలు

జిల్లా	రెవెన్యూలో జేఏ	రికార్డ్ అసిస్టెంట్	ఆఫీస్ సబార్డినేట్స్	చెన్‌మెన్	ఇరి గేషన్ లష్కర్	ఇరిగేషన్ హెల్పర్	మిషన్ భగీరథ హెల్పర్	మున్సిపల్ వార్డ్ ఆఫీసర్	మొత్తం
వరంగల్	51	46	–	11	89	27	66	22	312
హన్మకొండ	58	49	–	9	96	19	72	51	354
జనగామ	47	43	12	8	76	43	72	3	304
భూపాలపల్లి	49	40	3	9	80	39	66	2	288
మహబూబాబాద్	66	61	6	13	80	21	108	32	387
ములుగు	37	31	2	9	67	22	54	20	242

జువైనల్ హోంకు 'ఒకరోజు' 11 మంది బాలురు

కాజీపేట: నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడిన 11 మంది బాలురను జువైనల్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఆదేశం మేరకు శుక్రవారం ఒక రోజు జువైనల్ హోంకు పంపించినట్లు ట్రాఫిక్ సీఐ కె.సుజాత తెలిపారు. ఈ మేరకు కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. సీపీ రంగనాథ్ ఆదేశం మేరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి బాలురను పట్టుకున్నట్లు వివరించారు.

హత్యకేసులో వ్యక్తికి యావజ్జీవ కారాగారం

పాలకుర్తి టౌన్ : కులదురహంకార హత్యగా సంచలనం రేపిన కందిక సుశ్రిత, దేవర్స్‌లను భర్త మాచర్ల రమేష్ చంపిన కేసులో శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థాన విచారణలో రమేష్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరుకు చెందిన మాచర్ల రమేష్ ప్రేమించి పెళ్లి చేసుకున్న దళిత సామాజిక వర్గానికి చెందిన కందిక సుశ్రిత, కొడుకు దేవర్స్‌లను 2019 ఫిబ్రవరి 9న హైదరాబాద్ ఘట్‌కేసర్ ప్రాంతంలో కాల్చి బూడిద చేసిన విషయం విదితమే . మృతురాలి కుటుంబ సభ్యులు గూడూరులో వారిద్దరి మృతకళాలతో సమాధి కట్టి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన మేరకు సుమోటాగా కేసుగా స్వీకరించారు. ఈ కేసు విషయమై పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రశేఖర్ తగిన ఆధారాలు చేపట్టి వాదించడంతో రమేష్‌కు జీవిత ఖైదీగా శిక్ష పడింది. ఇదే కేసులో ఏ–2, ఏ–3గా ఉన్న తల్లిదండ్రులు మాచర్ల రాజేశ్వరి, రాజయ్యలతో పాటు ఏ–4గా నిందితుడిగా ఉన్న నిందితుడి చిన్నాన్న, గూడూరు మాజీ సర్పంచ్ మాచర్ల పుల్లయ్యలను నిర్దోషిగా కోర్టు తీర్పు ఇచ్చింది. భార్య, కొడుకులను అతికిరాతకంగా చంపిన రమేష్‌కు తగిన శిక్ష పడడంపై కుల అసమానతల నిర్మూలన పోరాట సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసు పీపీ చంద్రశేఖర్ వాదించడంతో పలువురు అభినందించారు.

ఒకే చోట 25 పాములు



చనిపోయిన నూనెకట్ల పాములు

బచ్చన్నపేట : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం బండనాగారం గ్రామంలో దాదాపు 25 పాములు ఒకే చోటుకు వరుసగా రావడంతో వాటిని చూసిన రైతులు ఆశ్చర్యంతోపాటు ఆందోళనకు గురయ్యారు. గ్రామంలో ఓ రైస్ మిల్లు వద్దకు శుక్రవారం పాములు వరుసగా వస్తుండడంతో ఏమి చేయాలో తోచక చుట్టు పక్కల రైతులు కర్రలతో వాటిని చంపడం మొదలుపెట్టారు. సుమారు 10 వరకు చనిపోగా.. మిగతావి నలు దిక్కులా పారిపోయాయి. రైతుల కాళ్ల మధ్య నుంచి పరుగులు తీయగా భయంతో వణికిపోయారు. ఇవి ప్రమాదకరమైన నూనె కట్లపాములని, జాగ్రత్తగా ఉండాలని రైతులు భిక్షపతి, లక్ష్మయ్య, రామచెంద్రు, నర్సిరెడ్డి తదితరులు పేర్కొన్నారు.

దాడి కేసులో ఇద్దరికి జరిమానా


వరంగల్ లీగల్: ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన నత్తి సుధాకర్‌పై దాడి చేసి గాయపర్చిన కేసులో అదే గ్రామానికి చెందిన ఇరువురు నేరస్తులు జన్ను సాంబయ్య, నత్తి దేవేందర్‌కు రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా సహాయ సెషన్స్ జడ్జి శ్రీనివాసులు శుక్రవారం తీర్పు వెల్లడించారు. 2019 జూన్ 7న మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక తర్వాత రాత్రి 9 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై వస్తున్న నత్తి సుధాకర్‌ను హత్య చేయాలని నిందితులు క్రికెట్ వికెట్స్, రాడ్స్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు.

జరిగిన ఘటనపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయగా విచారణలో సాక్ష్యాధారాలు పరిశీలించిన కోర్టు.. దాడి చేసి గాయపర్చిన నేరానికి ఇరువురు నేరస్తులకు శిక్ష విధించింది.

ఒడిశా టు మహారాష్ట్ర

- గంజాయి రవాణా
- పోలీసు తనిఖీలో 68 కిలోలు లభ్యం
- ఇద్దరి అరెస్టు, వాహనం సీజ్

దేవరుప్పుల : తక్కువ సమయంలో అధిక ఆదాయం సంపాదించాలని ఇద్దరు యువకులు నిర్ణయించుకున్నారు. దీనికి గంజాయి విక్రయాలే మార్గమనుకున్నారు. అనుకున్నదే తడువుగా ఓ మినీ వ్యాన్‌లో ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని హైదరాబాద్ మీదుగా ముంబైకి తరలిస్తుండగా మార్గమధ్యలో దేవరుప్పులలో పోలీసులకు చిక్కారు. ఖమ్మం జిల్లా ఇన్కూర్ మండలం అరెకాయలపాడు గ్రామానికి చెందిన కామరతపు వినయ్, బొమ్మ వేణు.. ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలించేందుకు సుఫారీ కుదుర్చుకున్నారు. శుక్రవారం మినీ వ్యాన్‌లో ఒడిశాలోని చిత్తరకొండ నుంచి హైదరాబాద్ మీదుగా ముంబైకి గంజాయిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో జనగామ జిల్లా దేవరుప్పులలో జనగామ–సూర్యాపేట రహదారి సీతారాంపురం స్టేజీ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా డ్రైవర్, మరో వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో డ్యాష్ బోర్డు, టూల్ బాక్సు తెరిచి చూడగా ప్రత్యేకంగా ప్యాక్ చేసిన గంజాయి లభ్యమైంది. నాయబ్ తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో ప్యాక్‌ను తెరవగా 68 కిలోల గంజాయి కనిపించింది. దీని విలువ రూ.10.60 లక్షల ఉంటుంది. అనంతరం గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వాహనం సీజ్ చేసినట్లు ఎస్సై కె శ్రవణ్‌కుమార్ వివరించారు. ఆర్‌ఐ రాజు, కానిస్టేబుళ్లు శ్యామ్‌సుందర్, యాకుబ్, అశోక్ పాల్గొన్నారు.



పోలీసుల తనిఖీల్లో లభించిన గంజాయి

కసాయి తండ్రిపై కేసు

మహబూబాబాద్ రూరల్ : ఓ తండ్రి తన పిల్లలకు పండులో ఎలుకల మందు కలిపి ఇచ్చాడు. ఈ పండును తిన్న ఒకరు మృతి చెందగా మరొకరు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనలో కసాయి తండ్రిపై హత్య, హత్యాయత్నం కేసులు నమోదు చేశామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై బీ.రాంచరణ్ శుక్రవారం తెలిపారు. మహబూబాబాద్ మండలం బలరాం తండా గ్రామానికి చెందిన పెద్దపులి రమేష్, అతడి భార్య శాంతి మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ క్రమంలో రమేష్ తన పెద్ద కుమారుడు విగ్నేష్ కుమార్, చిన్న కుమారుడు రాజ్ కుమార్‌కు పండులో ఎలుకల మందు కలిపి ఇచ్చాడు. దీనిని తిన్న రాజ్ కుమార్ గురువారం రాత్రి మృతిచెందగా విగ్నేష్ కుమార్ పరిస్థితి విషంగా ఉంది. దీనిపై భార్య శాంతి ఫిర్యాదు మేరకు రమేష్‌పై హత్య, హత్యాయత్నం కేసులు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

ట్రాక్టర్ బోల్తా..యువకుడి మృతి

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మర్రిమిట్ట శివారు తోటద్రుతండా సమీపంలోని జమ్మికుంట చెరువు ప్రాంతంలో పొలం దున్నడానికి వెళ్లిన ఓ ట్రాక్టర్ తిరిగిబడింది. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండావాసుల కథనం ప్రకారం వాంకుడోతు కిషన్, అచ్చమ్మ దంపతుల కుమారుడు గణేష్ (18) ఇంటర్ చదువుతూ ట్రాక్టర్ డ్రైవింగ్ నేర్చుకున్నాడు. ఇటీవల తండాకు చెందిన ఓ యజమాని ట్రాక్టర్‌ను నడుపుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఓ రైతు పొలం దున్నుతుండగా ట్రాక్టర్ తిరిగిబడింది. దీంతో గణేష్ కిందపడి అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తండావాసులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పర్వతగిరి: తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన పర్వతగిరిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన కొంగ భాస్కర్, మౌనిక దంపతులు మండల కేంద్రంలోని హైస్కూల్ సమీపంలో అద్దెకు ఉంటున్నారు. బస్టాండ్ దగ్గర మెడికల్ షాప్ నిర్వహించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పనులు ముగించుకున్న దంపతులు.. మెడికల్ షాపునకు వెళ్లారు. ఇది గమనించిన దుండగులు మధ్యాహ్నం ఇంట్లోకి చొరబడి బీరువాలో దాచిన సుమారు మూడు తులాల బంగారం, వెండి ఆభరణాలు, రూ.80వేల నగదు అపహరించారు. దీనిపై సమాచారం అందుకున్న ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మమూనూరు ఏసీపీ సతీష్, పర్వతగిరి సీఐ శ్రీనివాస్, ఎస్సై వీరభద్రరావు ఘటనా స్థలికి చేరుకుని చోరీ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుప్త నిధుల తవ్వకాల కలకలం

మల్హర్: మండలంలోని మల్లెంపల్లిలో శుక్రవారం గుప్త నిధుల తవ్వకం కలకలం సృష్టించింది. గ్రామానికి కిలో మీటర్ దూరంలోని ఓ వ్యవసాయ భూమి(రాజుల కోటగా పేరుగాంచిన)లో గుప్త నిధులు ఉన్నాయనే అనుమానంతో కొందరు దుండగులు జేసీబీ సహాయంతో గత గురువారం అర్ధరాత్రి తవ్వకాలు చేపట్టారు. ఈ తవ్వకాలు చేపట్టిన స్థలంలో భారీగా బంగారం లభించిందని గ్రామంలో పుకారు వ్యాపించింది. కాగా, సదరు ప్రదేశంలో ఎప్పటికీ గుప్త నిధుల కోసం దుండగుల తవ్వకాలు చేపడుతారని ప్రజలు తెలిపారు. దీనిపై ఎస్సై నరేష్‌ను వివరణ కోరగా గుప్త నిధుల తవ్వక విషయం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో ప్రదేశానికి సిబ్బందిని పంపించి గుంతను పరిశీలించామన్నారు. దీనిపై విచారణ చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

- మామునూర్‌లోని ఎత్తైన జాగాలో South / East కార్నర్ 390 చ॥గజాల్లో 1560 Sft నిర్మిత ఇంటికై సంప్రదించండి: సెల్: 9032111600. [W-785635]

REAL ESTATE

- ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ, వ్యవసాయేతర భూములు వెంచర్ల కోసం ప్రముఖ సంస్థకు తక్షణం కావలెను. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు తక్షణం సంప్ర : 9948801113 [HA-30033]

SERVICES

- హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి ఆర్థిక సహాయం చేయబడును. 8096520976, హన్మకొండ. [WA-7230]
- సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-189119]
- మీ బంగారం తాకట్టులో ఉందా! వడ్డీ చెల్లించలేకపోతున్నారా! తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788613]
- అతితక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్నా ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ఫోన్ : 9041115088 [HA-29901]

OLD AGE HOME

- త్రివేణి హోంకేర్: వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకోవడానికి, వంట, ఇంటి పనికి వర్కర్స్‌ను మీ ఇంటికే పంపబడును. ఫోన్ 9160900023, 9160900024. [H-189316]

BUSINESS OFFER

- RUTHUPARA PRAWNS. 50 Franchises in Telangana - 2.5 L. 50Kg's vacuum packed prawns / day. Rs.600 / pack (peeled, cleaned, ready-to-cook). Rs.60 Margin/pack. Contact: 8328099433. [WB-19489]

WANTED

- గణేష్ టింబర్ డిపో కమలాపూర్‌లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. సంప్ర॥ సెల్: 9440471253. [W-785637]
- శ్రీ సంతోష్ సోనాలిక షోరూం మహబూబాబాద్, తొర్రూరు బ్రాంచిలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, ఇన్సెంటివ్స్, TA + DA ఇవ్వబడును. సెల్: 7702403972. [W-785636]
- ఓల్డ్ రికార్డ్ చూసి న్యూ రికార్డ్ రాయుటకు స్త్రీ/పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. ప్రతిరోజు ఆదాయం. వివరాలకు సంప్ర: 7036253618. [W-189120]
- కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. మీ అర్హతకు తగిన విధంగా సంపాదించుకునే అవకాశం. పార్ట్ టైం 8000. ఫుల్ టైం: 20000/- 7993700904, 9014504770, 8977743043. [W-1002992]
- INC ఆఫీస్ నందు పనిచేయుటకు యువతి యువకులు కావలెను. P/T-9K / F/T - 24K. ఇతర వివరాలకు ✆ 6300264252 [G-786475]
- హనుమకొండలో గల ప్రముఖ కార్ డెకార్స్ నందు పనిచేయుటకు Car Washing boys, Electricians, Supervisors, Accountant, House Keeping మరియు Marketing లో చేయుటకు M/F కావలెను. Cell: 7995621165. [WA-13305]
- ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. సెల్: 88854 86421. [M-1221475]
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్. 9640258899, 9640468899 [HA-189314]

WANTED TEACHERS

- To Teach Maths, Telugu Primary, Telugu & Phy.Science, Bio Higher Classes. VISHWATEJA HIGH SCHOOL, Gopalpur Road, Hanumakonda. Cell: 9959770643 [K-1185570]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము